# సుతార్ల పంచాయతీ సుతార్లతోటి

- ఇంటి యజమానికి ఎందుకు పంచాయతీ!!
- పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా
- కోదాడ మేస్త్రిలు 1వ తేదీ పనిచేయడంపై వివాదం..
- చెన్నారం సుతార్లపై పోలీసుల అనుచిత వ్యవహారం




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:**

నేలకొండపల్లి, సుతారి మేస్త్రిల మధ్య పని విషయంలో మొదలైన పంచాయతీ చిలికి చిలికి గాలివానగా మారి పోలీస్ స్టేషన్‌కు చేరింది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపిస్తూ స్థానిక సుతార్లు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో ఈ నెల 1వ తేదీన సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన సుతారి మేస్త్రిలు పనులు చేస్తున్నారు. సుతారి యూనియన్ నిబంధనల ప్రకారం ప్రతి నెల 1వ తేదీన ఎవరూ పనులు చేయకూడదు. ఈ విషయం తెలుసుకున్న చెన్నారం స్థానిక సుతారి మేస్త్రిలు ఘటనా స్థలానికి వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా పని చేయవద్దని కోదాడ మేస్త్రిలను ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. అరుపులు, కేకలు, తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో కోదాడ మేస్త్రిలకు చెందిన సామాన్లను



స్థానికులు తీసుకెళ్లారు.

**పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు**

ఈ ఘటనపై చెన్నారానికి చెందిన ఇంటి యజమాని మురళి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులంతా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు కోదాడ సుతారులకు, ఇంటి యజమానికి అనుకూలంగా వ్యవహరిస్తూ స్థానిక సుతారి మేస్త్రిల పట్ల అనుచితంగా ప్రవర్తించారని మమ్మల్ని గెంటివేసినారని ఆరోపిస్తూ సుతార్లు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అదే సమయంలో స్థానిక సుతారి మేస్త్రి విజయ్‌ను కులం పేరుతో దూషించారని ఆరోపిస్తూ ఇంటి యజమాని మురళిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో స్టేషన్‌లో ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

**న్యాయం జరిగే వరకు పోరాటం:**
**స్థానిక సుతార్ల పోరాటం**

తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్థానిక సుతారి మేస్త్రిలు హెచ్చరించారు. యూనియన్ నిబంధనలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, బయటి వ్యక్తులు వచ్చి నిబంధనలు ఉల్లంఘిస్తే ఊరుకోబోమని తేల్చి చెప్పారు.

# ఉపాధి హామీ పనిలో వడదెబ్బ.. మహిళా కూలీ ఆసుపత్రిపాలు



నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగమణి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండుతున్న ఎండలకు ఉపాధి హామీ కూలీలు బలవుతున్నారు. మండలంలోని సదాశివాపురం గ్రామానికి చెందిన చిర్రా ప్రసాద్ భార్య చిర్రా నాగమణి ఉపాధి హామీ పనులు చేస్తుండగా తీవ్ర వడదెబ్బకు గురయ్యారు. ఉపాధి హామీ కూలీగా పనిచేస్తున్న నాగమణి మంగళవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతకు తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే తోటి కూలీలు ఆమెను నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు ఆమె ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలు మధ్యాహ్నం వేళల్లో పనులు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు పనులు నిలిపివేయాలని, కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ, నీడ సౌకర్యం కల్పించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఎమ్మెల్యేను కలిసిన గొల్లపల్లి సర్పంచ్



**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం గొల్లపల్లి సర్పంచ్ కిషన్ యాదవ్ గురువారం రోజున స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ ను మర్యాదపూర్వకంగా తన నివాసంలో కలిసి గ్రామానికి కావలసిన అభివృద్ధి పనులు ను గురించి వివరించి చెప్పారు , గ్రామ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు, అందుకుగాను ఎమ్మెల్యే మదన్మోహన్ సానుకూలంగా స్పందించారని గ్రామ సర్పంచ్ తెలిపారు, ఉప సర్పంచ్ మర్రి మధు తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన కన్నాపూర్, గొల్లపల్లి సర్పంచులు



**రామారెడ్డి రాజ ముద్ర న్యూస్:** స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ ను కన్నాపూర్ సర్పంచ్ గొల్ల మహేష్, గొల్లపల్లి సర్పంచు కిషన్ యాదవ్ ఇరు గ్రామాలలోని వివిధ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది దీనిలో భాగంగా కాంగ్రెస్ ప్రెసిడెంట్ కుమ్మరి బిక్షపతి, గొల్లపల్లి ఉపసర్పంచ్ మధు, వార్డు మెంబర్ లావణ్య, సతీష్ , హైదరాబాదులోని వారి నివాసంలో కలవడం జరిగింది అందుకుగాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# పుట్టే కొంచెం.. కొంచెం కూత గణం..?

- నాగారం మురుగుదొడ్లపై చిన్నారి సాయి స్నేహ డీసికి వినతి
- గంద్ర సాయి స్నేహ పటేల్



**నాగారం, రాజముద్ర న్యూస్:** ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ ప్రాంతంలో మహిళల కోసం అత్యవసరంగా ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని వినతి. మానవ కోణంలో ప్రజలకు అత్యవసర మూత్రశాలలు క్షణమే అమల్లోకి తీసుకురావాలని స్థానిక ప్రజల తరఫున నేను ఒక విద్యార్థినిగా గంద్ర సాయి స్నేహ పటేల్, 7వ తరగతి విద్యార్థిని, సాయి దిశా హై స్కూల్, నాగారం, ఒక చిన్న విద్యార్థినిగా మీకు ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను మన్నించండి మేడం గారు.. నాగారం అభివృద్ధి చెందుతోందని, జనాభా పెరుగుతోందని, కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయని చెబుతున్నారు. కానీ మహిళలకు అవసరమైన కనీస సౌకర్యమైన ప్రజా మరుగుదొడ్లు ఎక్కడ ఉన్నాయి మీరే పరిశీలించండి..? నేను స్కూల్ పనుల కోసం, షాపింగ్ కోసం లేదా ఏదైనా అవసరంతో బయటకు వెళ్లినప్పుడు అకస్మాత్తుగా మరుగుదొడ్డి అవసరం వస్తే ఎక్కడికి వెళ్లాలి ఒకసారి మీరు ఆలోచిస్తారా? నాగారం డివిజన్ పరిధిలోని కాలనీలలోని పరిసర ప్రాంతాలలో మా అమ్మ, అక్కలు, మహిళా కార్మికులు, వృద్ధ మహిళలు, చిన్నారులు ఇలాంటి పరిస్థితుల్లో ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో ఎప్పుడైనా అధికారులు ఆలోచించారా అని మిమ్మల్ని ప్రశ్నిస్తున్నందుకు మన్నించండి..? రోజంతా కష్టపడి పనిచేసే మహిళా కార్మికులు తమ అవసరాలను అణచుకుని ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. చాలామంది మహిళలు ఇబ్బంది పడుతూ కూడా బయటకు చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఉన్నపలంగా రాజకీయ నాయకులు మహిళల గౌరవం గురించి సభల్లో మాట్లాడటం గొప్ప కాదు. మహిళలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడమే నిజమైన గౌరవంగా భావిస్తే మహా మంచిదని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు. నాగారం వంటి పెద్ద నివాస ప్రాంతంలో మహిళల కోసం సరైన ప్రజా మరుగుదొడ్లు లేకపోవడం చాలా బాధాకరం.. విచారకరం. పార్టీలకతీతంగా స్థానిక పార్టీ నాయకులు ఆలోచించాల్సిన విషయాన్ని గ్రహించండి ఆచరణలో పెట్టే సమస్యకు పరిష్కారం చూపండి. ఒక మహిళగా మీరు ఈ సమస్య తీవ్రతను ఖచ్చితంగా అర్థం చేసుకోగలరని నేను నమ్ముతున్నాను. క్షమించండి మేడం? "స్వచ్ఛ భారత్" అంటున్నాం.. "మహిళా సాధికారత" అంటున్నాం, కానీ మహిళలకు అవసరమైన మరుగుదొడ్డి కూడా అందుబాటులో లేకపోతే ఆ నినాదాలకు అర్థం ఏంటో వివరించగలరా?" నాగారం ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, బస్ స్టాప్లు, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో వెంటనే ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారా..? చేయాలని కోరుతున్నాను. ఒక చిన్న విద్యార్థిని అడుగుతున్న ఈ ప్రశ్నకు సమాధానం మాటల్లో కాదు... చర్యల్లో చూపాలని డిప్యూటీ కమిషనర్ ను వేడుకుంటున్నాం. మహిళల గౌరవాన్ని కాపాడే దిశగా మీరు తక్షణ చర్యలు తీసుకుంటారని వెయ్యి కళ్ళతో వేచి చూస్తూ.. విశ్వసిస్తూ... ధన్యవాదములతో, వినయపూర్వకంగా మీ విద్యార్థి, స్థానికరాలు గంద్ర సాయి స్నేహ పటేల్, 7వ తరగతి విద్యార్థిని సాయి దిశా హై స్కూల్ చదువుతున్న చిన్నారి నాగారం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలోని స్థానిక ప్రజల అత్యవసరాల కోసం నా చిన్న ప్రయత్నం మీరందరూ నన్ను మన్నిస్తూ మన నాగారం డివిజన్ పరిధిలోని స్థానిక కాలనీలలో మరుగుదొడ్ల అవసరాల కోసం ప్రశ్నించినందుకు డిప్యూటీ కమిషనర్ కు, అలాగే స్థానిక పార్టీలకతీతంగా రాజకీయ నాయకులకు స్థానిక ప్రజలకు నా చిన్న మనవి ఆలకిస్తారని కోరుకుంటూన్నాను.

# సర్వేపల్లి లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఎన్నిక



**ఆత్మకూర్( ఎం). రాజమద్ర న్యూస్ :** ఆత్మకూర్( ఎం ) మండలం సర్వేపల్లి గ్రామంలో గురువారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామశాఖ అధ్యక్షుడిగా మచ్చ.నర సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులు ఈదుల కంటి హనుమంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏశబోయిన స్వామి,కార్యదర్శి బద్దుల పాండు, కోశాధికారి గ్యార మొగులయ్య,ఎస్సీ సెల్ అధ్యక్షులుగా గ్యార సాయి ను ఏకగ్రీవ ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మచ్చ నరసింహ మాట్లాడుతూ నామీద నమ్మకం ఉంచి నన్ను అధ్యక్షులు ఎన్నుకున్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.అదేవి ధంగా పార్టీ నియమా నిబంధనలకు కట్టుబడి ఉంటానని నాపై నమ్మకం ఉంచి బాధ్యత ఇచ్చినందుకు,పార్టీ కృషికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని కార్యకర్తలకు అందరికీ అందుబాటులో ఉండి నా వంతు సహాయ సహ కారాలు అందజేస్తానని అన్నారు.నాపై బాధ్యత ఉంచిగం దుకు గ్రామ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ ఏశబోయిన వెంకటేష్,వార్డు మెంబర్లు మచ్చ రాజు,కొమ్ము స్వామి,కల్వకుంట్ల రంగారెడ్డి,కల్వ కుంట్ల సుదర్శన్ రెడ్డి, దంతూరి విజయ్ కుమార్,మచ్చ రామచందర్,సుంకిశాల ఎల్లయ్య,యాస ఉపేందర్ రెడ్డి, నిమ్మల శ్రీనివాస్ రెడ్డి,మర్రిపల్లి దశరథ,నోముల భూపాల్ రెడ్డి,గ్యార యాదయ్య,గ్యార లసుమయ్య, కొమ్ము కిష్టయ్య,ని మ్మల మోహన్ రెడ్డి,కాసర బాధ అంజయ్య, ఈదులకంటి సత్తిరెడ్డి,మాన్పురి మార్కండేయ,ఏశబోయిన సత్యనారా యణ,మచ్చ శ్రీను, మామిడి రాజ్ కుమార్,మేడి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు చర్యలు

చీఫ్ ఇంజనీర్ రమేష్



**చర్లపల్లి, రాజముద్ర న్యూస్:** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టీజీ ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ రమేష్ తెలిపారు. గురువారం చర్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నెలకొన్న లో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు నాగార్జున కాలనీలోని 8 ఎం వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ ను 12.5 గా మార్చారు. నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ను ఎస్ఈ వెంకన్న తో కలిసి చీఫ్ ఇంజనీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగిన నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు. లోవిద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు పాత విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల స్థానంలో నూతన ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతో నాగార్జున నగర్ పరిసర ప్రాంతాల్లో లోవిద్య సమస్య తీరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైనిక్ పూరి డి ఈ అన్వర్ భాష, చర్లపల్లి ఏడిఈ రాందాస్, ఏఈలు బాల్ రాజు, రామకృష్ణ విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చేర్యుమాదారం చెరువుకు నీటి దొంగల గండి.. చేపల కోసం ఊరు బలి!



**రాత్రికి రాత్రే తూములు ఎత్తివేత..**
**అధికారుల మౌనంపై రైతుల అనుమానం**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి:మండిపోతున్న ఎండలకు చెరువులు అడుగంటుతుంటే, చేర్యుమాదారం చెరువు నుంచి మాత్రం గుట్టుచప్పుడు కాకుండా నీళ్లు గలగలా పారుతున్నాయి. చేపల వేటగాళ్లే దొంగచాటుగా తూములు ఎత్తి చెరువును ఖాళీ చేస్తున్నారని రైతులు భగ్గుమంటున్నారు.గ్రామస్తులు గాఢ నిద్రలో ఉండగా అర్ధరాత్రి దాటాక తూములు పూర్తిగా ఎత్తేశారు. ఉదయం లేచి చూసేసరికి చెరువు నీరు వృథాగా పారుతోంది. ఒక్కరాత్రిలోనే వేల లీటర్ల నీరు వాగులపాలైంది. "ఇది ముమ్మాటికీ చేపలు పట్టే వాళ్ల పనే. చెరువు ఎండితే చేపలు సులభంగా దొరుకుతాయని ఇలా చేస్తున్నారు" అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పశువులు దాహంతో అల్లాడుతుంటే..**

రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోయి పశువులకు గుక్కెడు నీళ్లు కూడా దొరకని దుస్థితి. తాగునీటికి గ్రామం అల్లాడుతోంది. ఇలాంటి సమయంలో ఉన్న కాస్త నీటిని కూడా దొంగలు తోడేస్తుంటే భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

**లస్కర్లు నిద్రపోతున్నారా?**

"చెరువుకు కాపలాగా ఉండాల్సిన లస్కర్లు ఏం చేస్తున్నారు? అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా జరుగుతోందా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళ జరుగుతున్న ఈ అక్రమాన్ని అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**రైతుల డిమాండ్**

వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించాలని, చెరువు వద్ద నిఘా పెంచి నీటి దొంగలను పట్టుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మిగిలిన నీటినైనా కాపాడకపోతే పశువులతో పాటు మనుషులం కూడా వలస వెళ్లాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

